# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 07-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విలువలతో కూడిన భారత్‌తోనే వికసిత్ భారత్ సాధ్యమని ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.**

2. **యువత ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.**

3. **ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు 3వేల 649 కోట్ల 63 లక్షల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేసినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

4. **రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల బీసీల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు.**

==========================

విలువలతో కూడిన భారత్‌తోనే వికసిత్ భారత్ సాధ్యమని ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమెరికాలోని డల్లాస్‌లో తెలుగు దయాస్పోరా సమావేశంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలుగువాళ్లు దశాబ్దాల క్రితమే అమెరికాకు వచ్చి నైపుణ్యాలు చాటారని పేర్కొన్నారు. తెలుగువారి గౌరవ మర్యాదలను అమెరికాలో ఉన్నవాళ్లు నిలబెట్టాలని మంత్రి లోకేశ్ మాట్లాడుతూ..

వాయిస్…27 సెకన్లు

--------------------------

ఆరోగ్య సంరక్షణపై యువత దృష్టి సారించాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్ కార్యక్రమంలో శాసన సభ్యులు రాధాకృష్ణతో కలిసి ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ… ఉదయం వ్యాయమం, నడక, మారథాన్ కార్యక్రమాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి వివరిస్తూ…

వాయిస్…27 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు 3వేల 649 కోట్ల 63 లక్షల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేసినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతు పండించిన పంటను సరైన ధరకు కొనుగోలు చేయడంతోపాటు, కొన్న వెంటనే నగదు రైతుల ఖాతాకు జమ చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అన్నదాతల కోసం ప్రతి అడుగులోనూ అండగా, భరోసాగా నిలిచింది కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 వేల 4 వందల 85 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు.

-----------------------------

రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల బీసీల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్, ఎన్ఆర్ఈడీసీఏపీ ప్రాజెక్టుల పురోగతి, అమలు తీరుపై ఆయన నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ –ఏపీఎస్పిడిసిఎల్ పరిధిలో 7.48 లక్షల ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై కూడా వచ్చే సంవత్సరం మార్చిలోపు 415 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ పనులు పూర్తి చేసేలా కార్యాచరణ పనులను వేగంగా చేపట్టాలని అధికారులను విజయానంద్ ఆదేశించారు.

-----------------------------

ఉపముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్ కర్ణాటకలోని ఉడుపిలో ఈరోజు పర్యటిస్తారు. ఉడుపి శ్రీకృష్ణ దేవాలయం దర్శనం అనంతరం అక్కడ నిర్వహించే 'బృహత్ గీతోత్సవం' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-----------------------------

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నుంచి చెన్నైకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. భీమవరంలో ఆయన నిన్న పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా 14 వందల కోట్లతో 868 గ్రామాలకు తాగు నీరు అందిస్తున్నట్లు కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ వివరిస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

-----------------------------

నెల్లూరు నగరాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో లోక్ సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... నెల్లూరు అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

-----------------------------

ఇండిగో ఎయిర్‌లైన్స్ విమాన సర్వీసులకు వరుసగా ఐదో రోజూ తీవ్ర అంతరాయం కలిగింది. 800కు పైగా విమానాలను ఆ సంస్థ నిన్న రద్దు చేసింది. ఈ సంఖ్యను రానున్న రోజుల్లో గణనీయంగా తగ్గిస్తామని

తెలిపింది. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పౌర విమానయాన శాఖ తెలిపింది. విమానాల రద్దు కారణంగా ప్రయాణికులకు దేశవ్యాప్తంగా అన్ని జోన్లలో కలిపి 89 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

---------------------------

భారత సైనికులు మొక్కవోని దీక్షతో చూపుతున్న దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశం గర్విస్తోందని ఎన్టీఆర్ జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పేర్కొన్నారు. విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలక్కియ మాట్లాడుతూ.. దేశ రక్షణకు ప్రాణాలను అర్పించిన సైనికుల సేవలు వెల కట్టలేమని చెప్పారు. ప్రజలు స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారంటే అందుకు సైనికుల రక్షణే కారణమన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

వాయిస్.. 29 సెకన్లు

---------------------------

యువత డ్రగ్స్ బారిన పడకుండా క్రమశిక్షణతో చదువులపై దృష్టి సారించాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో "డ్రగ్స్ వద్దు బ్రో, సైకిల్ తొక్కు" అవగాహన ర్యాలీ ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా పోలిస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరో వైపు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆధ్వర్యంలో గిరిజన యువకులతో వంజంగి కొండ వద్ద డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 5 కిలోమీటర్ల మారథాన్ రన్ నిర్వహించారు.

---------------------------

అనంతపురం జిల్లా కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలో పెన్నాహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి కాలువకు ఈరోజు గండి పడింది. గండిని పూడ్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. గండి పడిన ప్రాంతం వద్ద ఇసుక బస్తాలు ఏర్పాటు చేసి నీరు వృథాగా పోకుండా చూడాలని మంత్రి సూచించారు.

---------------------------

ఉత్తర ప్రదేశ్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –సర్ కార్యక్రమం కింద ఓటర్ జాబితా సవరణ పనులు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 91 వేలకుపైగా పోలింగ్ కేంద్రాల్లో సర్ పనులు 100 శాతం పూర్తయ్యాయని ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా తెలిపారు. అధికారులు బిఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలనీ, ప్రతి దశను నిరంతరం పర్యవేక్షించి ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు 100 శాతం అనుగుణంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు.

=====================